# భజనపాటలు

ఈ ప్రపంచం
మనకు ఏమిటిచ్చింది ?
ఈ ప్రపంచాన్నుంచి
మనం ఏమిటి స్వీకరించాము ?
మా అందరి గురించి
పట్టించుకునే వారెవరు?
అంతా మా కోసం ఏం చేశారు ?

అంచాత "ఇష్" మాట్లడొద్దు — మీ దుఃఖాలూ, మీ వ్యధలూ, బాధలూ అన్నీ తొలగిపోవాలంటే ?

"దమ్ములాగండ్రా, దమ్ము దమ్ము లాగుతూ ఉదయం సాయంత్రం భజన చేయండి"

'హరేకృష్ణ హరేరాం' అంటూ—

దమ్ము కొడుతూ ఉదయం, సాయంత్రం "హరేరాం హరేకృష్ణ" అంటూ నామసంకీర్తనం చేస్తే మీ బాధలు తొలగిపోతాయి. ఇది దీని ఉప దేశం లేదా తాత్పర్యం.

పది రూపాయల నోటిచ్చి మార్చుకురండర్రా చిల్లర అని మా వాళ్ళని వీధిలోకి పంపితే, ఆ నోటు పట్టుకుపోయి—

"దమ్ మారో దమ్

మిట్ జాయె గమ్

బోలో సుబహ్ శామ్

హరేకృష్ణ హరేరాం" అని పాడుతూ వచ్చారు. ఈ రికార్డెందు కర్రా తెచ్చారు వెధవల్లారా అంటే చిల్లర మార్చడానికి ఏదన్నా కొనాలి గదా అని నోటు మార్చి యిది తెచ్చాం. "అమ్మా! దమ్ మారో దమ్, మిట్ జాయే గమ్" అన్నారు వాళ్ళు. అని మూడురూపాయ లిచ్చారు మిగి లాయని. ఆ రికార్డుతో ఇల్లంతా హోరెత్తించేశారు. ఒకటే మూలగడం మూలిగి మూలిగి "యా" అంటూ నోరు తెరవడం, ఒకళ్ళ మీదొకళ్ళు పడి గెంతటం ఇదీ వరస. పైగా తిడితే ఇది భక్తి పాటమ్మా అని వాళ్ళు నాకు సర్దిచెప్పటం. వీళ్ళకు భక్తేవిటి నా మొహం? అల్లా అయితే మన పాత భజన పాటలన్నీ కూడా "ఫ్లాప్ మ్యూజిక్"కి పనికొస్తాయి కావును అనిపించింది. భక్తి కూడా నిషా కలిగించే మత్తుపదార్థమే గనుక బ్రహ్మం గారి కాలజ్ఞాన తత్వాలన్నీ పాప్‌బీట్ కుదిర్తే బ్రహ్మాండమైన హిట్‌సాం గ్సవుతాయి.

"రామ రామ రామసీతా" అనే సంకీర్తనం బాణీ వుందనుకోండి. అది "నాన నాన నాన నానా" అని వూగిపోతూ చివర మూలుగు పెట్టి 'యా' అని నోరు తెరవటం చేస్తే పైకి డెలిక్ మ్యూజిక్కవుతుంది చచ్చినట్టు.

అప్పనా తనామనా అంటే ఏవిటండీ గురూగారూ అని అడిగా - "అప్నా తన్‌మన్" అవుతుందన్నారు. రైట్-"మారోరి" అంటే ఏవిటండీ సార్ అన్నా, "మార్ అరె" అన్నారు."ఈ భైరన్నా" ఏంటండీ-అంటే, భైరన్నా ఈజ్ ఎప్రాపర్‌నవున్ "మనిషియొక్క పేరే మగువా" అన్నారు. "అప్నా తన్‌మన్ మారో అరె భైరన్నా" ఇది కూడా బండివాళ్ల ఐమీన్

ఎద్దు బండివాళ్ళు, జోడెద్దుల వాళ్ళు కూడా సారాయి ఓ పట్టుపట్టి "అప్పనా తనామనా మారోరె భై రన్నా" అని పాడే వారనుకుంటాను, ఇది కూడా చాలా గొప్ప ట్యూను అవుతుంది. "నన్న నా ననా ననా నానాన నై ననా" ఈ వరస ఏ హిందీవాడో దొంగిలించి పాటకడితే మనం వెర్రి మొహం వేసుకుని వింటాం, మనవి వెర్రి మొహాలు కనుక. ఉంకో పాటుంది మా వారు చెప్పారు, నాకూ తెలుసనుకోండి, మీకూ తెలుసనుకుంటాను.



"నెర నెర నెర బండీ........

అబ్బ దాని సోకో

జబ్బల దాకా జాకెట్టు-"

"నన నన నననన్నా, నన్న నాన నానా నన్నన నానా నానన్న" ఇలా అవుతుంది సూక్ష్మీకరిస్తే.

బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు తీసుకోండి మచ్చుకి –

"చెప్పలేదంటనక పొయ్యేరు

జనులార గురుని

చేరిగొల్చిన ము_క్తిసందేరు" దీనివరస కూడా హైపిచ్‌లో పాడితే బావుంటుంది.

"తోలుతి_త్తి యిది

తూటులు తొమ్మిది

తుస్సుమనుట ఖాయం—జీవా

తెలుసుకో అపాయం" దీని ట్యూన్ కూడా ఏకతార మీటితే చాలా హాయిగా వుంటుంది వినడానికి. అన్నిటికంటె నా క్లిష్టమైన మరో పాట వుంది. "రామ జోక మందూ కొనారే, ఓ జనూలారా రామ జోగీ మందూ కొనారే—కాటుకా కొండలావంటీ ఖర్మమూ లెడబాసే మందూ" అలాగే మరో పాట.

"రామనామం రామనామం

రామనామం రామనామం

రమ్యమైనది రామనామం"

మరోటి బ్రహ్మంగారి తత్వం. రైళ్లలో చిరతలు వాయిస్తూ బిచ్చ గాళ్ళు గొంతె_త్తి పాడుతూ వుంటారు— "ఏమిజన్మం బేమి జీవనమూ". ఈ భజన పాటలలో దీపం శమ్మా చుట్టూ తిరిగి అడుగులు వేస్తే చెక్క_లతో చేసే భజన-"అక్క_డ వుండే పాండురంగడు ఇక్క_డ వున్నాడే" అనేదీ. "రంగా రంగా యనరే, మంగళకరుడగు పాండురంగని" అని వస్తుంది? ఇది కూడా చాలా హాయిగా, శ్రావ్యంగా వుంటుంది వినడానికి. పాత పాటలని తేలిగ్గా కొట్టిపారవెయ్యడానికి వీల్లేని ట్యూన్లు యెన్నో వున్నాయి మనకి. తల్చినకొద్దీ తరగని గని. భ_క్తి పాటల్లో సంగీతాన్ని ఎమోషన్ జయిస్తుంది. పద్యాలూ పాటలు లేకపోతే జీవితం చప్పగా

చల్లారి పోయినట్లు వుంటుంది. రామదాసు కీర్తననుకుంటాను మరి చూడండి—

'రామరామ రఘురామ పరాత్పర

రావణ సంహార రణధీరా' అనేది మార్చింగ్ సాంగ్‌లా ఉంటుంది. ఇది డోలక్‌మీద దరువులు వేస్తూ పాడితే కూర్చున్న వారైనా సరే లేచి నిలబడి నాట్యం చేయాల్సిందే. జాతీయోద్యమంలో వచ్చిన గీతాలన్నీ చాలావరకు భజన పాటల మీంచి రాసినవే. 'రామ నామమను మిఠాయి ఇదిగో' అనే పాటమీంచి గాంధీమహాత్మునిమీద పాటకట్టి పాడారు. "రాధే గోపాలకృష్ణ, రాధే గోవింద కృష్ణ" అని కృష్ణభజన పాటలు కూడా వేరే వుండేవి. "రఘుపతి రాఘవ రాజారాం పతీత పావన సీతారాం సీతారాం జె సీతారాం" ఇది అందరికీ తెలిసినదే-దీని ట్యూన్ రకరకాలుగా మార్చుకోవచ్చు.

ఇంతకీ చెప్పొచ్చే దేవిటంటే మనకూ వున్నాయి బ్రహ్మాండమైన పాటలు, ట్యూన్లు. కాస్త ఓపిక చేసుకుని మన కీర్తనలు పాటలూ పజ్యాలు కాలగర్భంలో కలిసిపోకుండా ఆధునికం చేసుకుని వాడుకుంటే బలేమజాగా బాగుంటుంది. వాటిని తిప్పి తిప్పి కొట్టడవే. నేనూ మా వారూ భక్తిమీద ఒక న్యూవేవ్ పిక్చర్ తీస్తాం. అందులో టైటిల్ సాంగ్ "ఓ రోరి బండి వాడా" పెడతాం. భజన పాటలతో "దమ్‌మారో దమ్ మిట్ జాయ్‌గమ్" అనిపిస్తాం. ఆడంగి పాటలు పీకుడు పాటలూ పెట్టం, మ్యూజిక్ కూడా మ్యాన్లీగా వుండాల్సిందే.

భజన పాటల్లోనే కాదు కళ్ళు పెట్టుకుని వెతికితే బుర్రకథల్లోనూ మర్డర్‌సాంగ్స్‌లో కూడా "పాప్ బీట్" దొరుకుతుంది.

"హరి హరీ నారాయో ఆది నారాయో

కరుణించి మమ్మేలూ

కమలలోశనుడా—"ఇది కూడా పాప్‌సాంగ్‌కి పనికొస్తుంది భజన పాటా. పాత గ్రామఫోను రికార్డూ, బ్రహ్మంగారితత్వం, రామదాసుకీర్తన, మంగళహారతీ కాదేదీ ఇల్లాలి ముచ్చట్ల కనర్హం. బోలో సుబహ్‌శామ్ హరేకృష్ణ హరేరామ్!